



# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 157 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

ఆదివారం 12 జనవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## పీ-4 విధానంలో భాగస్వాములవ్వండి :సీఎం చంద్రబాబు పిలుపు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్ షిప్) విధానంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.



(రిపబ్లిక్ న్యూస్), జనవరి 12: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్ షిప్) విధానంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో పండుగ శోభ వికసించాలని ఆకాంక్షించారు. మనం, మనతో పాటు మన చుట్టూ ఉన్న అందరూ బాగుండటమే పండుగ అని తెలిపారు. ఆర్థిక అసమానతలు తొలగిపోయి, సమాజంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే అందరి ఇళ్లలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని తాను మనస్ఫూర్తిగా నమ్ముతున్నానన్నారు. ఇందులో భాగంగా ప్రతిపాదించిన పీ-4 విధానంలో భాగస్వాములు కావాలన్నారు. ఆరోగ్య, ఆదాయ, ఆనంద రాష్ట్రం కోసం సంకల్పం తీసుకుందామని కోరుతూ పీ4 విధాన పత్రాన్ని విడుదల చేశారు.

## నాకెలాంటి భేషజాలు లేవు.. ఎవరి సలహాలనైనా స్వీకరిస్తా: సీఎం రేవంత్

మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్రావు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



హైదరాబాద్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్రావు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తనకు ఎలాంటి భేషజాలు లేవని.. ఎవరి సలహాలనైనా స్వీకరిస్తానని చెప్పారు. విద్యాసాగర్రావు ఆత్మకథ 'ఉనిక పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సీఎం మాట్లాడారు. "విపక్ష నేతలు అయినా.. అవసరం ఉన్నచోట వారి అనుభవాన్ని వినియోగించుకుంటాం. తెలంగాణ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కృషి చేస్తున్నాం. మెట్రో, రీజనల్ రింగ్ రోడ్డు విషయంలో కేంద్రం సహకరించాలని ప్రధాని మోదీని కోరాను. కేంద్రం సహకరిస్తేనే.. రాష్ట్రాల అభివృద్ధి పరిపూర్ణమవుతుంది. హైదరాబాద్ మెట్రోకు అనుమతులు తెచ్చుకోవాల్సిన అవసరముంది. ఒకప్పుడు రెండోస్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో.. నేడు 9వ స్థానానికి పడిపోయింది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కొన్ని రాష్ట్రాల్లో అన్ని పార్టీలు కలిసి పోరాడుతున్నాయి. మనం పోటీ పడాల్సింది అమరావతితో కాదు.. ప్రపంచస్థాయి నగరాలతో" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### 40 ఏళ్లు ఆయనతో పనిచేశా.. ఏనాడూ మనస్పర్థలు రాలేదు: దత్తాత్రేయ

విద్యాసాగర్రావుతో 40 ఏళ్లు కలిసి పనిచేశానని.. ఆయనతో ఏనాడూ మనస్పర్థలు రాలేదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. నేతల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండొచ్చని.. మనస్పర్థలు మాత్రం ఉండకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఏబీవీపీ, భాజపా ఎదుగుదలకు విద్యాసాగర్రావు ఎంతో కృషి చేశారన్నారు. గోదావరి జలాలను మళ్లిస్తే తప్ప తెలంగాణ బతుకు లేదని ఎన్నో ఏళ్ల క్రితమే విద్యాసాగర్రావు చెప్పారని గుర్తుచేశారు. రాయలసీమకూ 100 టీఎంసీలు తరలించాలని ఆయన ఆకాంక్షించారన్నారు.

### 40 ఏళ్లు ఆయనతో పనిచేశా.. ఏనాడూ మనస్పర్థలు రాలేదు: దత్తాత్రేయ

నేతలు ఎవరు ఏ పార్టీలో ఉన్నా జాతీయ భావన ఉంటుందని మాజీ గవర్నర్ విద్యాసాగర్రావు అన్నారు. ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నా.. భారతీయతను వదులుకోకూడదని అంబేడ్కర్ బౌద్ధమతంలో చేరారని చెప్పారు. తన ఆత్మకథ 'ఉనిక' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విద్యాసాగర్రావు మాట్లాడారు. శ్రీపాదరావు ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం ఎంతో కృషిచేశారని.. అందుకే ఆ ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని భాజపా తీర్మానం చేసిందన్నారు. రథయాత్ర సమయంలో అశ్వమేధ యాగం చేస్తున్నారని ఆద్వాణీని ఎన్టీఆర్ మెచ్చుకున్నారని చెప్పారు. ఎన్టీఆర్ తన సినిమాల్లో బీసీ వాదాన్ని సమర్థంగా తెరకెక్కించారన్నారు. ఇంకా దేశంలో ఐదో వంతు పేదరికం ఉందని.. దానికి పరిష్కారం చూపాలన్నారు. యువతలోని శ్రమశక్తిని బయటకు తీయడమే ఇప్పటి నేతలకు అసలైన సవాల్ అని చెప్పారు. వారిని ప్రోత్సహించకపోతే గంజాయి వంటి దురలవాట్లకు లోనవుతారన్నారు. సీఎం రేవంత్రెడ్డి 'హైడ్రా' ఆలోచన అభినందనీయమని కొనియాడారు. గిరిజన ప్రాంతాల్లో రూ. వేల కోట్ల విలువైన సంపద ఉందని.. దాన్ని వెలికితీసి వారి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. హైడ్రా తరహాలో గిరిజన భూ సమస్యల పరిష్కారానికి ఓ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు.

## దిల్లీ ఎన్నికల బరిలోకి ఎన్సీపీ.. ఒంటరి పోరుకు సిద్ధం..!

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు.. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ ప్రకటించింది.

దిల్లీ, జనవరి 12, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకుంది. త్వరలో జరగబోయే ఈ ఎన్నికల బరిలోకి.. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్కు చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) దిగనున్నట్లు ప్రకటించింది.



25 నుంచి 30 స్థానాల్లో అభ్యర్థులను నిలపనుంది. ఇప్పటివరకు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, భాజపా మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఇకపై ఎన్సీపీ కూడా నిలవనుంది. ఎలాంటి పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమైంది. ప్రధానంగా వివిధ కమ్యూనిటీలకు చెందిన ఓటర్లు ఉన్న ప్రాంతాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులను ఖరారు చేసింది. రాజధానిలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్సీపీ దిల్లీ ఎన్నికల్లో దిగడం ఇదే తొలిసారి కాదు. 2020లోనూ ఆ పార్టీ ఐదు స్థానాల్లో పోటీ చేసింది. కానీ, ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. అయితే.. 2023లో ఎన్సీపీలోని ఎమ్మెల్యేలతో కలిసి అజిత్ పవార్ తన బాబాయ్ శరద్ పవార్పై తిరుగుబాటు చేయడంతో పార్టీలో చీలిక ఏర్పడింది. ఆ సంఘటన తర్వాత దిల్లీ ఎన్నికల్లో ఎన్సీపీ పోటీకి దిగడం ఇదే తొలిసారి. కాగా.. ఫిబ్రవర్ 5న దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. హ్యాట్రిక్ విజయం సాధించేందుకు ఆప్ శ్రమిస్తుండగా.. రాజధాని గద్దె ఎక్కేందుకు కాంగ్రెస్, భాజపా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల్లో ఎన్సీపీ కూడా పోటీ చేస్తుండడంతో దిల్లీలోని పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

## ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీగా బంగారం స్వాధీనం

ఏపీలో కస్టమ్స్ అధికారులు ఇటీవల చేపట్టిన ఆపరేషన్లో భారీగా బంగారం స్వాధీనం చేసుకున్నారు.




విజయవాడ, జనవరి 12, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో కస్టమ్స్ అధికారులు ఇటీవల చేపట్టిన ఆపరేషన్లో భారీగా బంగారం స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, తాడిపత్రి రైల్వే స్టేషన్, నెల్లూరు రైల్వే స్టేషన్, బొల్లపల్లి టోల్ ప్లాజా ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 17.9 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. 16 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరికి విశాఖలోని న్యాయస్థానం శనివారం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ విలువ రూ.14.37 కోట్లు ఉంటుందని చెప్పారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఈ బంగారాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు.

### సంక్రాంతి జోష్..

## ఆత్రేయపురంలో కేరళ తరహా పడవ పోటీలు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో కేరళ తరహాలో పడవ పోటీలు నిర్వహించారు.



ఆత్రేయపురం, జనవరి 12, (రిపబ్లిక్ న్యూస్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో కేరళ తరహాలో పడవ పోటీలు నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే సత్యానందరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. దీంతో పాటు ఈత పోటీలు నిర్వహించారు. వీటిని తిలకించేందుక పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఆత్రేయపురంలోని ప్రధాన పంట కాల్వలో ఈ పోటీలు జరుగుతున్నాయి

## ఎన్నికలంటేనే భయం వేస్తోంది: మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఇంకా సమస్యలున్నాయని మాజీ సీఎం, భాజపా నేత కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

విజయవాడ, జనవరి 12, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఇంకా సమస్యలున్నాయని మాజీ సీఎం, భాజపా నేత కిరణ్కుమార్ రెడ్డి అన్నారు. విజయవాడలో హైకోర్టు న్యాయవాది రవితేజ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంక్రాంతి ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.



తెలుగు రాష్ట్రాలు నీటి వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. దేశంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఎన్నికలంటే భయం వేస్తోందని.. రానున్న రోజుల్లో పోటీ చేయలేమని వ్యాఖ్యానించారు. డబ్బు లూటీ చేసే వాళ్లు కొందరు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని.. ప్రజలు వారికి ఓట్లు కూడా వేస్తున్నారని చెప్పారు. నాయకులు, అధికారులు కలిసి పంపకాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఏ పార్టీలో ఉన్నా వ్యక్తిగా తాను మారలేదన్నారు. పేదవారికి సాయం చేసే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. దేశ అభివృద్ధి కోసం భాజపా కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పులలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు.



చర్ల, జనవరి 12, (రిపబ్లిక్ న్యూస్): ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. భూపాలపట్నం, మద్దేడు ప్రాంతాల్లో ఆపరేషన్ చేపట్టిన క్రమంలో మావోయిస్టులు, భద్రత బలగాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఇక్కడ బందిపోరా, పోరంజెడ్ అడవుల్లో ఈ ఎదురుకార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు వర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఘటన స్థలి నుంచి పోలీసులు పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో.. నారాయణపూర్ జిల్లాలోని హెరైనార్ గుమ్చూర్ కొండల్లో నక్సల్స్ సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

## హైదరాబాద్లో స్థలం ఉండి ఇల్లు లేని వారికి తొలి ప్రాధాన్యత: మంత్రి పొన్నం ప్రభాకర్

రేషన్ కార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

హైదరాబాద్, జనవరి 12, (రిపబ్లిక్ న్యూస్): రేషన్ కార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాలోని అధికారులతో సమావేశమైనట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో లబ్దిదారుల పరిశీలన జరుగుతుందన్నారు. 21 నుంచి అర్హులైన వారి డేటా ఎంట్రీ చేస్తామని తెలిపారు. 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని వివరించారు. రేషన్ కార్డులకు గతంలో ఉన్న నిబంధనలే వర్తిస్తాయన్నారు. తమ ప్రభుత్వం కొత్త నిబంధనలు పెట్టడం లేదని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. "హైదరాబాద్ లో స్థలం ఉండి ఇల్లు లేని వారికి తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఇల్లు లేని వారందరికీ మంజూరు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. జిల్లాల నుంచి వలస వచ్చిన వారికి కూడా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. వీటి పంపిణీలోనూ ఆదర్శంగా నిలుస్తాం. రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ న్యాయం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తింపజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను పూర్తి చేస్తాం. ఈ విషయంపై గుత్తేదారులతో మాట్లాడతాం. పూర్తయిన ఇళ్లను లాటరీ వేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఎన్టీఆర్-నీల్ ప్రాజెక్ట్..

## స్క్రిప్ట్ వర్క్ పై దర్శకుడి సతీమణి పోస్ట్

కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్, నటుడు ఎన్టీఆర్ కాంబినేషన్లో ఒక పవర్ఫుల్ ప్రాజెక్ట్ ఓకే అయిన విషయం తెలిసిందే. ఈ సినిమా గురించి తాజాగా ప్రశాంత్ నీల్ సతీమణి లిఖిత అప్డేట్ ఇచ్చారు.





కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్, నటుడు ఎన్టీఆర్ కాంబినేషన్లో పవర్ఫుల్ ప్రాజెక్ట్ ఓకే అయిన విషయం తెలిసిందే. ఇప్పటికే పూజా కార్యక్రమాలు చేసుకున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతుందా? అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రశాంత్ నీల్ సతీమణి లిఖిత అప్డేట్ షేర్ చేశారు. ఆ సినిమా స్టోరీపై ప్రశాంత్ నీల్ కసరత్తులు చేస్తోన్న ఫొటో షేర్ చేసిన ఆమె.. "వైట్ బోర్డ్ బయటకు వచ్చిందంటే.. ఆయన స్క్రిప్ట్ వర్క్ పూర్తి స్థాయిలో జరుగుతుందని మాకు తెలుసు" అని ఆమె పేర్కొన్నారు. రేరింగురోర్, వర్క్హోం వంటి హ్యాషా ట్యాగ్స్ జత చేశారు. ప్రస్తుతం ఈ ఫొటో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఎన్టీఆర్ 31వ ప్రాజెక్ట్ గా ఇది పట్టాలెక్కనుంది. మైత్రీ మూవీస్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. త్వరలో ఈ సినిమా షూట్ మొదలు కానుందని గత కొన్నిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ నెల మూడో వారంలో కర్ణాటకలో తొలి షెడ్యూల్ మొదలు కానుందని సమాచారం. ఎన్టీఆర్ వచ్చే నెలలో సెట్స్లోకి అడుగు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్లో తారక్ మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఆయనకు జోడీగా రుక్మిణీ వసంత్ కనిపించే అవకాశముంది. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు, ఎన్టీఆర్ ప్రస్తుతం 'వార్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకుడు. 'కేజీయఫ్ 1, 2'తో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు ప్రశాంత్ నీల్. 2023లో విడుదలైన 'సలార్'తో ఆయన మరో విజయాన్ని అందుకున్నారు. ఆయన చేతిలో ప్రస్తుతం 'సలార్ 2', 'కేజీయఫ్ 3' ప్రాజెక్టు ఉన్నాయి.


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1863:** ప్రముఖ భారతీయ తత్త్వవేత్త స్వామి వివేకానంద జననం (మ.1902). ఈ రోజును జాతీయ యువజన దినోత్సవంగా పాటిస్తారు.
- **1869:** భారతీయ తత్వవేత్త భగవాన్ దాస్ జననం (మ.1958).
- **1895:** ప్రముఖ వైద్య శాస్త్రవేత్త, యల్లాప్రగడ సుబ్బారావు జననం (మ.1948).
- **1908:** రేడియో సందేశాలను చాలా దూర ప్రాంతాలకు ఈఫిల్ టవర్ నుండి మొట్టమొదటిసారి ప్రసారం చేసారు.
- **1940:** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలీ జననం.
- **1998:** పంతొమ్మిది యూరోపియన్ దేశాలు మానవ క్లోనింగ్పై ఆంక్షలు విధించేందుకు ముందుకొచ్చాయి.
- **2004:** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే మరణం ( జ.1926).



స్వామి వివేకానంద


భగవాన్ దాస్


యల్లాప్రగడ సుబ్బారావు


ఈఫిల్ టవర్


వీరప్ప మొయిలీ


మానవ క్లోనింగ్


రామకృష్ణ హెగ్డే

# ఆరోగ్యంపై వార్తలు.. తొలిసారి స్పందించిన విశాల్

**నటుడు విశాల్ ఆరోగ్యంపై ఇటీవల నెట్టింట ప్రచారాలు జరిగిన విషయం తెలిసిందే. వీటిపై ఆయన స్పందించారు.**



నటుడు విశాల్ ఆరోగ్యంపై ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. వీటిపై తాజాగా ఆయన స్పందించారు. శనివారం సాయంత్రం 'మద గజ రాజ' ప్రీమియర్కు హాజరై.. తాను ఆరోగ్యంగానే ఉన్నానని తెలిపారు. "మా నాన్న అంటే నాకెంతో ఇష్టం. ఆయన వల్లే నేనెంతో ధైర్యంగా ఉన్నా. జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా తట్టుకుని నిలబడుతున్నా. ఈ విషయాన్ని ఇప్పుడు ఎందుకు చెబుతున్నానంటే.. మూడు లేదా ఆరు నెలలకొకసారి సినిమాల నుంచి విశ్రాంతి తీసుకుని వెళ్లిపోతున్నానని కొంతమంది అంటున్నారు. ప్రస్తుతం నాకు ఎలాంటి సమస్యల్లేవు. అంతా బాగానే ఉంది. ఇప్పుడు నా చేతులు వణకడం లేదు. మైక్ కూడా కరెక్టా పట్టుకోగలుగుతున్నా. ఇటీవల మీరు చూపించిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు. నా తుది శ్వాస వరకూ మీ అభిమానాన్ని మర్చిపోను. గెట్ వెల్ సూన్, కమ్ బ్యాక్ అంటూ మీరు పెట్టిన సందేశాలు కోలుకునేలా చేశాయి" అని విశాల్ తెలిపారు. ఇటీవల జరిగిన ఈవెంట్ తో పోలిస్తే ఇందులో ఆయన ఆరోగ్యంగా, ఫిట్గా కనిపించారు. విశాల్ హీరోగా సుందర్.సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మదగజరాజ'. ఈ సినిమా ప్రమోషన్స్లో భాగంగా గత వారం చెన్నైలో చిత్రబృందం ప్రత్యేక ఈవెంట్ నిర్వహించింది. ఇందులో విశాల్ పాల్గొన్నారు. సినిమా గురించి మాట్లాడుతున్న సమయంలో ఆయన చేతులు వణికాయి. పూర్తి నీరసంగా కనిపించారు. దీంతో ఈవెంట్లో పాల్గొన్న వారు కంగారు పడ్డారు. దీనిపై యాంకర్ మాట్లాడుతూ.. విశాల్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారని చెప్పింది. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్గా మారాయి. విశాల్కు ఏమైంది? అంటూ స్థానిక, ఆంగ్ల పత్రికల్లోనూ వార్తలు వచ్చాయి. దీనిపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. గెట్ వెల్ సూన్ అంటూ పలువురు పోస్టులు పెట్టారు. ఈ క్రమంలోనే ఆయన టీమ్ వైద్యుల రిపోర్ట్ను విడుదల చేసింది. ఆయన వైరల్ ఫీవర్తో ఇబ్బందిపడుతున్నట్లు టీమ్ వెల్లడించింది. సుందర్.సి దర్శకత్వం వహించిన ఈ సినిమా దాదాపు 12 ఏళ్ల క్రితమే పూర్తైనప్పటికీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైంది. అంజలి, వరలక్ష్మి శరత్కుమార్ కథానాయికలుగా నటించారు.



# కొద్ది నెలలు నేనే సారథిగా ఉంటా.. :బీసీసీఐతో రోహిత్!

జట్టు పగ్గాలను ఇప్పుడే వదులుకోవాలని రోహిత్ శర్మ భావించడం లేదని తెలుస్తోంది. అందుకు మరికొంత సమయం ఇవ్వాలని బీసీసీఐ సమావేశంలో చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి.




ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ను భారత్ కోల్పోవడం పై బీసీసీఐ సమీక్ష చేసింది. అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్ శర్మ మీటింగ్ కు హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ స్పష్టంగా చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. విరాట్, రోహిత్.. ఎవరైనా సరే ఆడితేనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని నిబంధనను కఠినతరం చేయనుంది. మినహాయింపు కావాలంటే కోచ్, చీఫ్ సెలక్టర్ నిర్ణయిస్తారు. అదే సమయంలో భవిష్యత్తు టెస్టు, వన్డే సారథి ఎంపికపైనా తీవ్రంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ తీసుకుంటాడని అనుకున్నా.. అలాంటిదేమీ లేదని ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. సారథిగా తానే కొన్ని నెలలు కొనసాగుతానని రోహిత్ ఈ మీటింగ్లో లో చెప్పినట్లు కథనాలు వస్తున్నాయి.

### బుమ్రాకు అప్పగించడంపై..

రోహిత్కు బదులు జస్ప్రీత్ బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించాలనే సూచనలూ, డిమాండ్లూ వచ్చిన సంగతి తెలిసిందే. మరికొందరు మాజీలు మాత్రం బుమ్రాపై అనవసర ఒత్తిడి పెట్టొద్దని వ్యాఖ్యానించారు. ఈ అంశంపైనా సమీక్ష సమావేశంలో చర్చ జరిగినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. అయితే, బుమ్రా ఫిటెనెస్పై బీసీసీఐ ఆందోళనగా ఉన్నట్లు తెలుస్తోంది. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో 150కి పైగా ఓవర్లను వేసిన బుమ్రా వెన్ను నొప్పి కారణంగా సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్లో బౌలింగ్ చేయలేదు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడటంపై అనుమానాలు మొదలయ్యాయి. దీంతో టెస్టు, వన్డే సారథ్య బాధ్యతలను అప్పగించడం పై బీసీసీఐ ఆలోచన చేస్తున్నట్లుంది. రోహిత్నే కొనసాగించి.. బుమ్రా మళ్లీ ఫిట్నెస్ సాధించిన తర్వాత కెప్టెన్గా చేసేందుకు మొగ్గు చూపే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలోనూ భారత జట్టును రోహిత్ శర్మ నడిపించడం ఖాయంగా కనిపిస్తోంది.

## అందం

# వంటల్లో వాడే పసుపుతో తెల్ల జుట్టును నల్లగా మార్చుకోవచ్చు, ఎలా వాడాలంటే

నిండా ముప్పై ఏళ్లు నిండక ముందే తలంతా తెల్ల వెంట్రుకలతో కనిపించే వారు చాలా మంది ఉన్నారు. కొందరు ఈ సమస్య గురించి అంతక పట్టించుకోరు. మరికొందరు మాత్రం సీరియస్గా ఉంటారు. హెన్నా, హెయిర్ డై, మార్కెట్లో దొరికే వివిధ ప్రొడక్ట్స్ వాడి తెల్ల జుట్టు కాస్తా నల్లగా మార్చుకుంటున్నారు.

జుట్టు అందంలో కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ.. ఒత్తైన, మెరిసే, పొడవైన కేశాలు ఉండాలని కోరుకుంటారు. అయితే, జుట్టు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. జన్యులోపాలు, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, దుమ్ము కారణంగా తెల్లజుట్టు ఈ జనరేషన్లో సమస్యగా మారింది. తెల్లజుట్టుతో నలుగురిలోకి వెళ్లాలంటే కొందరు ఇబ్బంది పడుతున్నారు. నిండా ముప్పై ఏళ్లు నిండక ముందే తలంతా తెల్ల వెంట్రుకలతో కనిపించే వారు చాలా మంది ఉన్నారు. కొందరు ఈ సమస్య గురించి అంతక పట్టించుకోరు. మరికొందరు మాత్రం సీరియస్గా ఉంటారు. హెన్నా, హెయిర్ డై, మార్కెట్లో దొరికే వివిధ ప్రొడక్ట్స్ వాడి తెల్ల జుట్టు కాస్తా నల్లగా మార్చుకుంటున్నారు. హెయిర్ డై, హెన్నా, హెయిర్ కలర్ వంటి వాటిలో హానికరమైన రసాయనాలు ఉంటాయి. ఇవి జుట్టుకు హాని కలిగిస్తాయి. అలాంటప్పుడు జుట్టును నల్లగా మార్చడానికి కొన్ని ఇంటి చిట్కాలు ఫాలో అవ్వచ్చు. మనం వంటల్లో వాడే పసుపుతో తెల్ల జుట్టు సమస్యను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. పసుపును తెల్ల జుట్టుకు ఎలా ఉపయోగపడుతుంది? దానిని ఎలా వాడాలి అన్న విషయాలు ఇక్కడ తెలుసుకుందాం.

### పసుపుతో ప్రయోజనాలు

పసుపు వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇది యాంటీ ఇన్ఫమేటరీ లక్షణాలతో ఉన్న శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇందులో యాంటీ ఫంగల్, బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫమేటరీ లక్షణాలు అధికంగా ఉన్నాయి. ఇవి జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జుట్టుకు మేలు చేసే ఐరన్, కాపర్, వంటి ఔషధ గుణాలు పసుపులో ఉన్నాయి. పసుపుతో తెల్ల జుట్టు సమస్యకు చెక్ పెట్టవచ్చని నిపుణులు అంటున్నారు. పసుపును తెల్ల జుట్టు కోసం ఎలా వాడాలో తెలుసుకుందాం.



### పసుపుతో హెయిర్ మాస్క్



పసుపుతో తెల్ల జుట్టు కోసం హెయిర్ మాస్క్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఒక గిన్నెలో చెంచా పసుపు, రెండు చెంచాల ఉసిరి పొడిని తీసుకోవాలి. ఈ పొడిని కడాయిలో బాగా వేయించాలి. నల్ల రంగు వచ్చిన తర్వాత స్టౌ ఆపేసి.. దానిని పక్కకు తీసుకోవాలి. చల్లారిన తర్వాత ఈ పొడిలో అలోవెరా జెల్ (కలబంద గుజ్జు) అవసరమైనంత కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని బాగా మిక్స్ చేయాలి.

### ఎలా అప్లై చేయాలి?



తయారు చేసిన మిశ్రమాన్ని జుట్టు బాగా అప్లై చేయాలి. జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు బాగా అప్లై చేయాలి. ఆ తర్వాత 30 నిమిషాల పాటు హెయిర్ మాస్క్ని అలానే వదిలేయాలి. ముప్పై నిమిషాల తర్వాత సాధారణ నీటితో జుట్టును శుభ్రపర్చుకోవాలి. ఆ తర్వాత తేలికపాటి షాంపూతో స్నానం చేస్తే మంచిది. ఈ మాస్క్ను వారానికి రెండు నుంచి మూడు సార్లు అప్లై చేస్తే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### పసుపుతో మరొక చిట్కా - కావాల్సిన పదార్థాలు



పసుపు - 3 టేబుస్ స్పూన్లు
ఆవాల నూనె - ఒక కప్పు
నల్ల జీలకర్ర - టేబుల్ స్పూన్
కాఫీ పొడి - ఒక టేబుల్ స్పూన్
విటమిన్ ఇ - క్యాప్సూల్స్




**తయారీ విధానం**

ముందుగా పాన్ తీసుకోండి. పాన్ పొయ్యి మీద పెట్టి ఆవాల నూనె, పసుపు, నల్ల జీలకర్ర, కాఫీ పొడి అందులో వేసి నల్లగా వచ్చేంతవరకు బాగా మరిగించండి. ఆ తర్వాత దీన్ని వడకట్టి చిన్న గిన్నెలోకి తీసుకోండి. ఆ తర్వాత ఈ మిశ్రమంలో రెండు విటమిన్ ఇ క్యాప్సూల్స్ వేసి బాగా మిక్స్ చేయండి. ఆ తర్వాత నూనెను జుట్టు కుదళ్లకు బాగా అప్లై చేసి సర్క్యులర్గా బాగా మసాజ్ చేయండి. అరగంట లేదా గంట పాటు అలాగే ఉంచి.. ఆ తర్వాత తేలికపాటి షాంపూతో స్నానం చేయండి. వారానికి రెండు నుంచి మూడు సార్లు ఇలా చేయడం వల్ల తెల్ల జుట్టు నల్లగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.

### పసుపుతో ఇంకొక చిట్కా

ఇందుకోసం మెంతులు, కలోంజి సీడ్స్, పసుపు, ఆవాల నూనె కావాలి. ముందుగా పాన్ పొయ్యి మీద పెట్టి రెండు చెంచాల మెంతులు, మూడు స్పూన్ల కలోంజి గింజలు వేసి ఐదు నిమిషాల పాటు బాగా వేయించండి. ఆ తర్వాత మూడు టేబుల్ స్పూన్ల పసుపు వేసి గ్యాస్ మంటను సిమ్లో పెట్టి నల్లగా వచ్చేంత వరకు బాగా వేయించండి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీలోకి తీసుకుని పొడి చేయండి. ఆ తర్వాత ఈ పొడిలో ఆవాల నూనె కలుపుకోండి. దీనిని బాగా మిక్స్ చేసి జుట్టు కుదుళ్ల వరకు బాగా అప్లై చేయండి. గంట తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయండి. వారానికి ఒకసారి ఇలా చేస్తే తెల్ల జుట్టు నల్లగా మారుతుందంటున్నారు నిపుణులు.



**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.